చివరికిలా..


ఎండిన వరి చేలో మేస్తున్న పాడిగేదె

రెక్కలు ముక్కలు చేసుకొని వరిసాగు చేస్తున్న రైతులకు భూ గర్భజలాలు నిరాశకు గురిచేస్తున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఎండలు ప్రచండంగా మారుతుండటంతో వరి పొలాల్లో తడి ఆవిరైపోతోంది. చెరువులు, కుంటల్లో నీటి జాడలు అడుగంటి పోవడంతో బోరు బావులు వట్టిపోతున్నాయి. దీంతో వరికి సాగు నీరందక ఎండుముఖం పడుతోంది. చేలు ఎండిపోయి బీటలు వారుతున్నాయి. చెమట చుక్కలు చిందించి సాగు చేస్తున్న వరి కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. చివరికి మండల పరిధిలోని రైతులు ఎండిన పొలాలల్లో పశువులను వదిలి మేపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

– మిరుదొడ్డి(దుబ్బాక):


మిరుదొడ్డిలో చుక్క నీరు లేని చెరువు

క్లుప్తంగా

ఎమ్మెల్యే పల్లా పరామర్శ


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని ఐనాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ అత్కూరి కనకలక్ష్మి(45) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. దీంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె పార్థీవదేహం వద్ద నివాళర్పించారు. వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కీర్తన, రాజేందర్‌రెడ్డి, గురువయ్యగౌడ్‌, కిషన్‌, కృష్ణ, శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్‌ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు దారుణం


పోలీసుల అదుపులో ఉన్న అంగన్వాడీలు

దుబ్బాకటౌన్‌: దుబ్బాక ప్రాజెక్ట్‌ పరిధిలోని దుబ్బాక, అక్బర్‌ పేట భూంపల్లి, తొగుట, దౌల్తాబాద్‌ మండలాల్లో అంగన్వాడీ టీచర్లను పోలీసులు మంగళవారం అక్రమ అరెస్టులు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్‌ మండిపడ్డారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న మినీ అంగన్వాడీల వేతనాలను వెంటనే విడుదల చేయాలన్నారు. పెరిగిన వేతనాలను అమలు చేయాలని కోరుతూ హైదరాబాదులోని ప్రజావాణిలో వినతి పత్రం ఇవ్వడానికి బయలుదేరుతున్న వారిని అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అంగన్వాడీల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు దీన, అనురాధ, మమత, కనకతార తదితరులు పాల్గొన్నారు.

వెల్ఫేర్‌ బోర్డు ఏర్పాటు చేయండి

బెజ్జంకి(సిద్దిపేట): హమాలీ కార్మికులకు వెల్ఫేర్‌ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. బెజ్జంకిలో మంగళవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులు ప్రమాదాల బారిన పడినప్పుడు వారి కుటుంబాలు బజారున పడుతున్నాయన్నారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు, బియ్యం తరలింపులోను హమాలీలు పనిచేస్తున్నారని, వారికి బీమా పథకం అమలు చేసి రూ.10 లక్షలు సహాయం అందించాలని కోరారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి ఎల్లయ్య, సాయికృష్ణ, సత్తయ్య, రాజు, లక్ష్మణ్‌, నర్సింగం, రాజమల్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


యోగాతో మానసికోల్లాసం

డీపీఓ దేవకీదేవి


విద్యార్థులతో కలసి యోగా చేస్తున్న డీపీఓ

కొమురవెల్లి(సిద్దిపేట): యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని డీపీఓ దేవకీ దేవి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం విద్యార్థులతో కలసి యోగా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఎదగడానికి యోగా ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం


మహిళ మృతదేహం

గజ్వేల్‌రూరల్‌: గుర్తు తెలియని మహిళ మృత దేహం మంగళవారం లభ్యమైంది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద గుర్తు తెలియని మహిళ చనిపోయి ఉందని తెలిపారు. సుమారు 50 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు.

బల్దియాలో హెల్ప్‌ డెస్క్‌

సిద్దిపేటజోన్‌: స్థల క్రమబద్ధీకరణ పథకానికి సంబంధించి మున్సిపల్‌ కార్యాలయంలో మంగళవారం కమిషనర్‌ ఆశ్రిత్‌ కుమార్‌ హెల్ప్‌ డెస్క్‌ను ప్రారంభించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సందేహాల పరిష్కారానికి ఈ డెస్క్‌ పనిచేస్తుందని చెప్పారు. మరిన్ని వివరాలకు 95055 07248ను సంప్రదించాలని సూచించారు.

నైపుణ్యంతోనే వ్యవస్థాపకులుగా ఎదగొచ్చు

జిల్లా విద్యా ప్రణాళికా సమన్వయకర్త రామస్వామి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్‌ డా.సునీత

సిద్దిపేటఎడ్యుకేషన్‌: విద్యార్థులు భవిష్యత్‌లో వ్యవస్థాపకులుగా ఎదిగేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యా ప్రణాళికా సమన్వయకర్త రామస్వామి పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాలలో వ్యవస్థాపకత అభివృద్ధి సెల్‌, కృషికల్ప ఎన్‌జీఓల ఆధ్వర్యంలో మంగళవారం వ్యవస్థాపకత అభివృద్ధిపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌ చొరవతో జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో మంచి వ్యవస్థాపకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డా.సునీత మాట్లాడుతూ విద్యార్థులు వ్యవస్థాపకత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొనేందుకే ఈ సదస్సు నిర్వహించామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కృషికల్ప ఎన్‌జీఓ సీఈఓ సీఎం పాటిల్‌ మాట్లాడుతూ ఒక చిన్న ఆలోచనతో మొదలైన రెడ్‌బస్‌, ఫేస్‌బుక్‌, వాట్సప్‌, జొమాటో తదితర సంస్థలు ఎదిగిన తీరును వివరించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక సెల్‌ సమన్వయకర్త గురుచరణ్‌దాస్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ డా.అయోధ్యరెడ్డి, సీఓఈ డా.గోపాలసుదర్శనం, అధ్యాపకులు ఉమామహేశ్వరి, డా.సీహెచ్‌ మధుసూదన్‌, పిట్ల దాసు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య.. చొరవ చూపండి

ఆర్డీఓకు సీపీఎం నాయకుల వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌ డివిజన్‌ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చొరవ చూపాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. ఐఓసీలో ఆర్డీఓ చంద్రకళకు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎల్లయ్య మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌ పరిధిలోని గజ్వేల్‌, ములుగు, వర్గల్‌, మర్కుక్‌, జగదేవ్‌పూర్‌, రాయపోల్‌తోపాటు గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య గత మూడు నెలల నుంచి తీవ్రంగా ఉందన్నారు. ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో పాటు గ్రామాల్లో జనాభా పెరిగి నీటి కొరత తీవ్రమైందని, ప్రజల అవసరాలకనుగుణంగా నీటి సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటికి సైతం రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మల్లన్నసాగర్‌, కొండపోచమ్మసాగర్‌తో పాటు మాత్‌పల్లి వద్ద పంప్‌హౌజ్‌ను ప్రారంభించినప్పటికీ సాగునీటి సమస్య తీరలేదని, వేసవి సమీపిస్తుండడంతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, హమద్‌, ప్రవీణ్‌, రాజు, రాములు, యాదగిరి, స్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో పోటీతత్వం


ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులతో అధ్యాపకులు

ప్రిన్సిపాల్‌ గోవర్ధన్‌

నంగునూరు(సిద్దిపేట): వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచుతాయని ప్రిన్సిపాల్‌ గోవర్ధన్‌ అన్నారు. రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్‌ కళాశాలలో ఉమ్మడి మెదక్‌ జిల్లాస్థాయి సృజన టెక్‌ ఫెస్ట్‌ వైజ్ఞానిక ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంప్యూటర్‌ సైన్స్‌, ఇంజనీరింగ్‌ విద్యార్థులు చేసిన పరిశోధనలను స్టాల్‌లో ప్రదర్శించారు. సిద్దిపేట, రాజగోపాల్‌పేట విద్యార్థులు ఎయిర్‌ కాన్వాస్‌, చిన్నకోడూర్‌, సిద్దిపేట మహిళా కళాశాల విద్యార్థినులు ఉమెన్‌ సేఫ్టీ అలర్ట్‌ సిస్టం ఆకట్టుకున్నాయి. అలాగే మెదక్‌ మహిళా కళాశాల విద్యార్థినులు యాక్సిడెంట్‌ ప్రివెంట్‌ సిస్టం, జోగిపేట, మెదక్‌ విద్యార్థులు అడ్వాన్స్డ్‌ థ్రెట్‌ అనాలసిస్‌ అండ్‌ డిఫెన్స్‌ను ప్రదర్శించి పని తీరును వివరించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రవీణ్‌కుమార్‌, డాక్టర్‌ చంద్రసేనాచారి, సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌శాఖ అధిపతి అభినవ్‌, ప్రిన్సిపాల్‌ గోవర్ధన్‌ చక్కని ప్రదర్శనతో ఆకట్టుకున్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల పరిశోధనలను స్ఫూర్తిగా తీసుకొని నైపుణ్యాన్ని పెంచుకోవాలని కోరారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఆర్‌డీఓ

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని అదనపు డీఆర్‌డీఓ బాలకృష్ణ హెచ్చరించారు. మండల కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ, ప్రజా వేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం జరిగిన రూ.4.20 కోట్ల పనులను చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామాల్లో 4 కోట్లకు పైగా పనులు జరిగాయన్నారు. పనులపై తనిఖీ నిర్వహించగా రూ.1.23 లక్షలు రికవరీ, రూ.57 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అలాగే పంచాయతీరాజ్‌ నుంచి రూ.58వేలు రికవరీకి ఆదేశించినట్లు చెప్పారు. ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాదగిరి, ఏపీఓ శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

జూద స్థావరంపై పోలీసుల దాడి

మర్కూక్‌(గజ్వేల్‌): మర్కూక్‌లో ఓ పేకాట స్థావరంపై సిద్దిపేట్‌ టాస్క్‌ఫోర్స్‌, మర్కూక్‌ పోలీసులు మంగళవారం దాడిచేశారు. ఐదుగురు అరెస్టు కాగా, నలుగురు పరారైనట్లు పోలీసులు తెలిపారు. స్థావరం వద్ద రూ 8,590 నగదుతో పాటు, 5 మొబైల్‌ ఫోన్‌లు లభించాయని, ఈ దాడిలో బాలరాజ్‌, రంగా కృష్ణ, నరేశ్‌, రవీందర్‌రెడ్డి, ప్రవీణ్‌ అరెస్టు కాగా, రాంసింగ్‌, నాగిరెడ్డి, నాగరాజు, పాండురంగం పరారీలో ఉన్నట్లు తెలిపారు.

అభివృద్ధిలో భాగస్వాములుకండి

గజ్వేల్‌రూరల్‌: గజ్వేల్‌–ప్రజ్ఞాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార, వాణిజ్య సముదాయాల యజమానులు, పరిశ్రమల నిర్వాహకులు పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్‌ కమిషనర్‌ గోల్కొండ నర్సయ్య కోరారు. మంగళవారం ఆయన పలు వార్డుల్లో పర్యటించి ఇంటి పన్నులు వసూలు చేశారు. ప్రజ్ఞాపూర్‌ శివారులోని వీఓ బయోటెక్‌ పరిశ్రమ నుంచి రూ.7,48,234 పన్ను వసూలు చేశారు. అనంతరం నర్సయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు తమ ఇంటి, నల్లా పన్నులతో పాటు ట్రేడ్‌ లైసెన్స్‌ ఫీజును చెల్లించాలన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ భరద్వాజ్‌, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మా.. కరుణించమ్మా..


ఆలయం ఎదుట వేసిన భారీ పట్నం వద్ద భక్తులు


వర్గల్‌లో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మర్కూక్‌(గజ్వేల్‌): మండలంలోని పాతూర్‌లో రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం పూజారి బాగవ్వ ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. మామిళ్ళ యాదగిరి యాదవ్‌ ఆధ్వర్యంలో ఒగ్గు కథ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

వర్గల్‌లో..

వర్గల్‌(గజ్వేల్‌): స్థానిక రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలలో భాగంగా గౌడసంఘం ఆధ్వర్యంలో అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. భక్తజన హర్షధ్వానాల మధ్య కల్యాణ వేడుక నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శతశాతం సాధించేలా కృషి చేయాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్‌): పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించేందుకు కృషిచేయాలని జిల్లా విద్యాధికారి(డీఈఓ) ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని మర్పడ్గ హైస్కూల్‌ను మంగళవారం సందర్శించారు. పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టారంటూ ఉపాధ్యాయులను, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వేళలో రాగి జావ, స్నాక్స్‌ అందిస్తున్నారోలేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడాది జీపీఏకు సంబంధం లేకుండా మార్కులే పరిగణలోకి తీసుకుంటారని విద్యార్థులకు తెలుసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భైరయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి

అర్బన్‌ మండల ఏఓ శ్రీనాథ్‌


పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్‌

సిద్దిపేటఅర్బన్‌: యాసంగిలో నీటిఎద్దడి ఉండే రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ఏఓ బి.శ్రీనాథ్‌ సూచించారు. మండలంలోని పొన్నాలలో నీటి ఎద్దడితో వడలిపోతున్న వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో తక్కువ నీటి వినియోగం ఉండే పంటలను సాగుచేసుకోవాలని సూచించారు. వరికి బదులు ఆరుతడి పంటలైన మొక్కజొన్న, పొద్దుతిరుగుడు, నువ్వులు లాంటివి సాగుచేసుకోవడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చని చెప్పారు. అలాగే పంట మార్పిడి వల్ల నేలలో పోషకాలు పెరిగి చీడ, పీడలు తగ్గుతాయని వివరించారు. ఆయన వెంట ఏఈఓ మీరాబాయి ఉన్నారు.

ప్రేమ వ్యవహారంలో ఇల్లు ధ్వంసం


చెల్లాచెదురుగా పడిఉన్న సామగ్రి

హుస్నాబాద్‌రూరల్‌: ఓ ప్రేమ వ్యవహారం రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. దీంతో అమ్మాయి బంధువులు అబ్బాయి ఇంటిని ధ్వంసం చేశారు. ఈ ఘటన మంగళవారం హుస్నాబాద్‌ మండలం భల్లునాయక్‌తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భల్లునాయక్‌ తండాకు చెందిన ఎల్‌.తిరుపతి కూతురును కిషన్‌ కొడుకు 15 రోజుల కిందట ప్రేమ పేరుతో తీసుకుపోయాడు. అమ్మాయి తండ్రి తిరుపతి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరినీ పట్టుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అమ్మాయి దగ్గర ఉన్న బంగారాన్ని అబ్బాయి తీసుకున్నాడని, దానిని తిరిగి ఇవ్వాలని అమ్మాయి బంధువులు అడిగారు. ఇవ్వకపోవడంతో అబ్బాయి ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. అలాగే వ్యవసాయ బావి వద్ద పశుగ్రాసం దహనం చేశారని, విద్యుత్‌ మోటారును బావిలో పడవేసినట్లు అబ్బాయి తండ్రి కిషన్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఐదుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్‌ తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి


డ్రోన్‌ల పనితీరును వివరిస్తున్న శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక): పంటసాగులో యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్‌ శ్రీదేవి రైతులకు సూచించారు. మండలంలోని తుక్కాపూర్‌లో పొద్దుతిరుగుడు, వరి పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొద్దుతిరుగుడు సాగుకు ఎరువుల యాజమాన్యం, సూక్ష్మపోషకాల అవసరం చాలా ఉంటుందన్నారు. బోరాన్‌ 400 గ్రాములు ఎకరాకు స్ప్రే చేయడం వల్ల తాలుగింజల శాతం తగ్గి అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. కూలీల కొరతను ఎదుర్కోడానికి డ్రోన్ల సహాయంతో స్ప్రే చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వరిలో కాండం తొలుచు పురుగు నివారించేందుకు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్‌ ఉమారాణి, విజయ్‌, పల్లవి, శ్వేత, ఏఓ మోహన్‌, ఏఈఓ రాజేశ్‌ రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **హుండీ ఆదాయం లెక్కింపు**

మద్దూరు(హుస్నాబాద్‌): బెక్కల్‌ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. బుగ్గ రాజేశ్వరస్వామి ఆలయ ఈఓ కె.శ్రీధర్‌రెడ్డి, చొప్పరి మల్లేశం, ధర్మకర్త మండలి సభ్యులు, కోటి లింగాల సేవా సమితి సమక్షంలో లెక్కింపు చేపట్టారు. మొత్తం 39 రోజులకుగాను రూ.79,844 ఆదాయం సమకూరిందని ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు. ఏఎస్‌ఐ విజయ్‌కుమార్‌, అర్చకుడు శివప్ప తదితరులు పాల్గొన్నారు.

◆ **కఠిన చర్యలు తప్పవు**

మద్దూరు(హుస్నాబాద్‌): అనుమతి లేకుండా వాగుల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని దూల్మిట్ట తహసీల్దార్‌ మధుసూదన్‌ హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండాపూర్‌కు చెందిన మంద యాదగిరి జాలపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని రూ.15వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ **మెగా రుణ మేళా**

సిద్దిపేటజోన్‌: బ్యాంకులు నిర్వహించే రుణమేళాలను వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్‌ బ్యాంక్‌ మేనేజర్‌ హరిబాబు సూచించారు. మంగళవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో సిద్దిపేట యూనియన్‌ బ్యాంక్‌ ఆధ్వర్యంలో మెగా రుణమేళా నిర్వహించారు. సామాజిక భద్రతా పథకం కింద మూడు వేల దరఖాస్తులు, ముద్ర పథకం కింద 30 దరఖాస్తులు,130 మహిళలకు రుణమేళాలో మంజూరు చేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు వికాస్‌, వివిధ బ్రాంచ్‌ మేనేజర్లు పాల్గొన్నారు.

◆ **అప్పుల నుంచి రైతులకు ఉపశమనం**

సిద్దిపేటకమాన్‌: రైతులను ప్రైవేటు అప్పుల నుంచి బయటపడేసేందుకు రిజర్వ్‌ బ్యాంక్‌ బ్యాంకర్లకు మార్గదర్శకాలను జారీ చేసిందని రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పంట రుణాలకు అదనంగా దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలను మంజూరు చేయాలని ఆర్‌బీఐ అన్ని బ్యాంకులకు ఆదేశాలిచ్చిందన్నారు. సమావేశంలో మల్లికార్జున్‌రెడ్డి, భూపతిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **వాహనదారులకు కౌన్సెలింగ్‌**

సిద్దిపేటకమాన్‌: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ అన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 155 మందికి మంగళవారం ఆయన కౌన్సిలింగ్‌ నిర్వహించారు. అతివేగం, ట్రిపుల్‌ రైడింగ్‌, రాంగ్‌ సైడ్‌, సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు.

◆ **మద్యం తాగి వాహనాలు నడపొద్దు**

గజ్వేల్‌రూరల్‌: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్‌ సీఐ మురళి హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో 12 మంది పట్టుపడ్డారన్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి ప్రియాంక రూ.13,400 జరిమానా విధించినట్లు తెలిపారు.

మరో 13 మందికి..

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13 మందికి కోర్టు రూ.20,500 జరిమానా విధించిందని ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌ కుమార్‌ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో నిర్వహించిన వాహన తనిఖీల్లో వారు పట్టుబడ్డారని మంగళవారం ఆయన తెలిపారు.

◆ **పాలకవర్గం మౌనం వీడాలి**

హుస్నాబాద్‌: సీసీఐ పత్తి కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై వ్యవసాయ మార్కెట్‌ కమిటీ పాలకవర్గం మౌనం వీడాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్‌ అన్నారు. పత్తి కొనుగోళ్ల విషయంలో ఏఈఓల సంతకాలు ఫోర్జరీచేసి అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించిన జిల్లా అధికారులు ఏఓను సస్పెండ్‌ చేశారన్నారు. అవినీతిపై మార్కెట్‌ పాలకవర్గం స్పందించకపోవడంపై పలు అనుమానాలు వస్తున్నాయని, ఏఓపై క్రిమినల్‌ కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు.

◆ **మీనాక్షి నటరాజన్‌ను కలిసిన నాయకులు**



సిద్దిపేటఅర్బన్‌: తెలంగాణ కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను జిల్లా నాయకుడు, మిట్టపల్లి మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన మెదక్‌ పార్లమెంట్‌ సమీక్ష సమావేశం సందర్భంగా ఆమెను కలిశారు. పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు పాటుపడాలని, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించినట్టు శ్రీనివాస్‌తో పాటు సాకి ఆనంద్‌ ఉన్నారు.